ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

గురువారం 6 జూన్ 2024

పారిశ్రామికవాడ మొగ్గు బీజేపీ వైపే..

- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
- ఆత్మపరిశీలనలో నాయకులు
- బీజేపీ క్యాడర్‌లో నూతనోత్సాహం

7



కారు.. బోరు

తాజా ఎన్నికల ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రధానంగా గులాబీ పార్టీ శిబిరాన్ని నైరాశ్యంలో పడేశాయి. అనూహ్యమైన ఫలితాలతో బీఆర్ఎస్ శ్రేణులు కుంగిపోతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని వాపోతున్నారు. ఇదే లోక్‌సభ పరిధిలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు విస్తృత ప్రచారం చేసినా ఫలితం ఇలా ఉందంటే.. వారు దృష్టిపెట్టకుంటే డిపాజిట్ ఓట్లు కూడా గల్లంతయ్యేవని భావిస్తున్నారు.

- సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో స్వల్ప ఓట్ల ఆధిక్యం
- సంగారెడ్డి, పటాన్‌చెరు, మెదక్‌లో ఎదురుగాలి
- 'గులాబీ' శిబిరంలో తీవ్ర నైరాశ్యం
- కంచుకోటలో ఓటమిపై పోస్టుమార్టం

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 5 :

మెదక్ లోక్‌సభ అంటే బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట. వరుసగా ఐదు ఎన్నికల్లో భారీ మెజార్టీలను సొంతం చేసుకున్న రికార్డు ఈ పార్టీకి ఉంది. బీఆర్ఎస్‌కు అధికారం ఉన్నా, లేకున్నా.. ఎలాంటి విపత్కర పరిస్థితులున్నా మెదక్‌లో మాత్రం గులాబీ పార్టీని ఆదరిస్తూనే ఉన్నారు. 2004, 2009 ఉద్యమ సమయంలోనూ, 2014లో తెలంగాణ ఏర్పాటవుతున్న సందర్భంలోనూ, 2014 ఉప ఎన్నికలోనూ, 2019లో పార్టీ ఐదేళ్ల పాలనకు రెఫరెండంగానూ ఈ లోక్‌సభ ఓటర్లు బీఆర్ఎస్‌ను గెలిపించారు. తాజా ఎన్నికల్లోనూ ఇదే పునరావృతం అవుతుందని ఆకాంక్షించారు. కానీ అంచనాలను తలకిందులు చేస్తూ ఆ పార్టీకి మూడో స్థానం కట్టబెట్టారు.

ఆ నాలుగు చోట్లా ఫ్లాప్ షో

పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ పటాన్‌చెరులో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు లక్ష పైచిలుకు ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 94వేల ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి కేవలం 54 వేల ఓట్లు పోలయ్యాయి. సంగారెడ్డిలోనూ ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ ఉన్నారు. ఇక్కడ అత్యధికంగా కాంగ్రెస్‌కు 75 వేలు, బీజేపీకి 70 వేలు, బీఆర్ఎస్ మాత్రం 27 వేల ఓట్లే పోలయ్యాయి. నర్సాపూర్‌లోనూ కాంగ్రెస్‌కు 72,376 ఓట్లు పోలవ్వగా కారుకు కేవలం 54,372 ఓట్లు వచ్చాయి. ఇక మెదక్ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పూర్తిగా వెనుకబడింది. బీజేపీ కంటే 27వేల ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఫలితాల్లో సత్తాచాటిన ఈ నియోజకవర్గాల్లో ప్రస్తుతం 'కారు'పార్టీకి ఎదురుగాలి తగిలింది.

మూడు సెగ్మెంట్లలో ప్లస్

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఆ పార్టీకి పరువు దక్కిందనే చెప్పాలి. ఇక్కడ మొదటిస్థానంలో బీఆర్ఎస్‌ను ఆదరించారు. రెండోస్థానంలో ఉన్న కాంగ్రెస్ కంటే 20వేల ఓట్ల ఆధిక్యం లభించింది. బీజేపీ అభ్యర్థిది మూడోస్థానం. ఇక రఘునందన్‌రావు సొంత నియోజకవర్గమైన దుబ్బాకలో ఆయనకు భారీ మెజారిటీ దక్కుతుందని అంతా భావించారు. కానీ ఇక్కడ కూడా బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటింది. దాదాపు 16వేల ఓట్ల ఆధిక్యాన్ని దక్కించుకుంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో 54 వేల మెజారిటీ పొందిన బీఆర్ఎస్‌కు ఈసారి మాత్రం ఓట్లు తగ్గాయి. అదే విధంగా సిద్దిపేట నియోజకవర్గంలో చావుతప్పి కన్నులొట్టబోయినట్లు బీఆర్ఎస్‌కు స్వల్ప ఆధిక్యం లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హరీశ్‌రావుకు 82వేల పైచిలుకు మెజారిటీ ఇచ్చారు. అయితే తాజా పార్లమెంటు ఎన్నికల్లో ఆ మెజారిటీ 2వేల పైచిలుకు ఓట్లకు పరిమితం కావడమే చర్చకు దారితీస్తున్నది. సిద్దిపేట పట్టణం మినహాయిస్తే చిన్నకోడూరు, నారాయణరావుపేట, నంగునూరు, సిద్దిపేట రూరల్ మండలాల్లో మాత్రం బీఆర్ఎస్ పైచేయి సాధించింది. సిద్దిపేట పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, స్థానిక ముఖ్య నేతలపై ఉన్న వ్యతిరేకతతోనే బీజేపీని ప్రజలు ఆదరించినట్లుగా చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అభిమానం ఉన్నప్పటికీ, ఆయన విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ కొందరిపై ఉన్న అసంతృప్తితోనే ఓట్లు మళ్లినట్లుగా అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు హిందుత్వ వాదం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆర్ఎస్ఎస్ వర్గాలు, ఆర్యవైశ్య సామాజికవర్గ ప్రచారం, రఘునందన్ వ్యక్తిగత సంబంధాలు తదితర అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపినట్లుగా భావిస్తున్నారు.

ఓటమిపై సమీక్ష

దారుణ ఓటమిని బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ పార్టీకి ఎదురులేని ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ఎదురుగాలి వీయడంపై డైలమాలో పడ్డారు. ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఓవైపు మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి, మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నీతానై వ్యవహరించినా ఫలితాలు దెబ్బతీయడంపై తర్జనభర్జన పడుతున్నారు. అన్నింటికీ మించి మాజీ కలెక్టర్, ఈ ప్రాంతంతో సుపరిచితమైన వెంకట్రామారెడ్డి అభ్యర్థిగా ఉండడంతో కొత్త జోష్ సంతరించుకుంది. దీనికితోడు పీవీఆర్ ట్రస్టుతో రూ.100 కోట్ల విద్యానిధి, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఉచితంగా అందిస్తానని హామీలు ఇచ్చారు. ఇవి కూడా ఓటర్లను ఆకర్షించలేకపోయాయా? అని యోచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరిగిన లోటుపాట్లు, ఇతర అంశాలపై పోస్టుమార్టం చేస్తున్నారు. కొన్నిచోట్లా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, పలువురిపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడం, బీఆర్ఎస్‌ను ప్రత్యర్థులు తీవ్రంగా విమర్శించడం, పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ తప్పిదాలు దొర్లడం తదితర అంశాలపై విశ్లేషణ జరుపుతున్నట్లుగా తెలుస్తోంది.

2019 మెదక్ పార్లమెంట్ ఫలితాలు		2023 అసెంబ్లీ ఫలితాలు (మెదక్ లోక్‌సభ పరిధి)		2024 మెదక్ పార్లమెంట్ ఫలితాలు	
కొత్త ప్రభాకర్‌రెడ్డి (బీఆర్ఎస్)	5,96,048	బీఆర్ఎస్	6,68,955	రఘునందన్‌రావు (బీజేపీ)	4,71,217
గాలి అనిల్‌కుమార్(కాంగ్రెస్)	2,79,621	కాంగ్రెస్	4,20,881	నీలం మధు (కాంగ్రెస్)	4,32,078
రఘునందన్‌రావు (బీజేపీ)	2,01,567	బీజేపీ	2,11,626	పి.వెంకట్రామిరెడ్డి (బీఆర్ఎస్)	3,96,790
బీఆర్ఎస్ మెజారిటీ	3,16,427	బీఆర్ఎస్ ఆధిక్యం	2,48,114	బీజేపీ మెజారిటీ	39,139

మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో సెగ్మెంట్ల వారీగా ఓట్ల వివరాలు, మెజారిటీ

సెగ్మెంట్	పోలైన ఓట్లు	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజారిటీ / పార్టీ
సిద్దిపేట	1,74,969	62,823	33,174	65,501	2,678 / బీఆర్ఎస్
మెదక్	1,75,409	67,374	55,588	40,776	11,786 / బీజేపీ
నర్సాపూర్	1,91,315	51,811	72,376	54,372	18,004 / కాంగ్రెస్
దుబ్బాక	1,64,952	50,873	31,641	66,714	15,841 / బీఆర్ఎస్
గజ్వేల్	2,25,607	56,811	65,539	85,432	19,893 / బీఆర్ఎస్
సంగారెడ్డి	1,79,801	70,310	75,287	27,874	4,977 / కాంగ్రెస్
పటాన్‌చెరు	2,60,541	1,03,775	94,294	54,581	9,481 / బీజేపీ
పోస్టల్ బ్యాలెట్	14,297	7,440	4,179	1,540	3,261 / బీజేపీ
మొత్తం	13,72,894	4,71,217	4,32,078	3,96,790	39,139 / బీజేపీ

జహీరాబాద్ నియోజకవర్గంలోని మూడు సెగ్మెంట్ల ఓట్ల వివరాలు, మెజారిటీ

సెగ్మెంట్	పోలైన ఓట్లు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	మెజారిటీ / పార్టీ
జహీరాబాద్	2,00597	1,03,129	69,671	23,018	33,458 / కాంగ్రెస్
నారాయణఖేడ్	1,75,508	78,280	55,695	31,891	22585 / కాంగ్రెస్
అందోలు	1,91,320	82,612	66,398	36,406	16,214 / కాంగ్రెస్

కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితాలు

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మిశ్రమ ఫలితాలనే పొందింది. రెండింటిలో ఆ పార్టీ బలం పెంచుకోగా ఐదింటిలో తగ్గించుకున్నది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలులో సెగ్మెంట్‌లో ఆ పార్టీ బలం 20.72 శాతం, ఆ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఇలాఖా నారాయణఖేడ్ సెగ్మెంట్‌లో 14.10 శాతం ఓట్లు తగ్గాయి. మైనంపల్లి రోహిత్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ సెగ్మెంట్‌లోనూ 14.94 శాతం ఓట్లకు కోత పడింది. ఇక జహీరాబాద్ సెగ్మెంట్‌లో 2.95 శాతం, నర్సాపూర్ సెగ్మెంట్‌లో 2.34 శాతం ఓట్లకు గండిపడింది. అనూహ్యంగా సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 6.93 శాతం ఓట్లు, పటాన్‌చెరు సెగ్మెంట్‌లో 0.64 శాతం ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పెరిగాయి. ఏమైనా ఆర్నెళ్లలోలోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చిన విలక్షణ తీర్పు రాజకీయ పక్షాలను ఆత్మపరిశీలనలో పడేసిందని పేర్కొనవచ్చు.

బీజేపీ దూకుడు.. బీఆర్ఎస్‌కు బ్రేకులు



- సంగారెడ్డి జిల్లాలో అంతటా బీఆర్ఎస్‌కు మూడో స్థానమే
- ఆధిపత్యం చాటిన బీజేపీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లాలో బీజేపీ సాగించిన దూకుడుకు బీఆర్ఎస్ విలవిలలాడింది. ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ మూడో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

పార్లమెంట్‌లో ఫలితాల్లో బీజేపీ జోరు

2023 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మూడింటిని గెలుచుకున్నది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుచుకున్న బీఆర్ఎస్ మిగిలిన అందోల్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలిచింది. నాటి ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి చూస్తే జాలికలగకమానదు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఈ పార్టీ పొందిన ఓట్లు 12 శాతంలోపే ఉంది. అలాంటిది బీజేపీ ఆరు నెలల్లో పరిస్థితులను తారుమారు చేసుకున్నది. పటాన్‌చెరు సెగ్మెంట్‌లో భారీ ఆధిక్యాన్ని ప్రదర్శించగా, సంగారెడ్డి సెగ్మెంట్‌లోనూ ఊహించని స్థాయిలో విజృంభించింది. ఇక మెదక్ జిల్లాలోని రెండు సెగ్మెంట్లలోనూ భారీగా పుంజుకున్నది. జహీరాబాద్, అందోల్, నారాయణ్‌ఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బీజేపీ గణనీయమైన ఓట్లను సాధించింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ బీజేపీ బలం బాగా పెరిగిందని చెప్పుకోవచ్చు. మెదక్ జిల్లా పరిధిలోని నర్సాపూర్, మెదక్‌లో అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ నామమాత్ర ప్రదర్శన చేయగా లోక్‌సభలో మాత్రం ఓట్ల వేట కొనసాగించింది. మెదక్ సెగ్మెంట్‌లోనైతే భారీ మెజారిటీని కైవసం చేసుకున్నది. నర్సాపూర్‌లోనూ బలాన్ని పెంచుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి అంతంతమాత్రంగా ఉన్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల వచ్చే సరికి హవా ప్రదర్శించింది. ఇందుకు కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారు రావాలన్న ఆకాంక్ష, హిందుత్వ ఎజెండాకు ఆకర్షితులవడమే ప్రజలు ఆ పార్టీని ఆదరించడానికి కారణమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బీజేపీ జోరుకు అడ్డుకట్టవేయలేకపోయిన బీఆర్ఎస్ తన ఉనికికే ప్రమాదం తెచ్చుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలో బీజేపీ మూడో స్థానంలో ఉండగా ఈసారి బీఆర్ఎస్ ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

పుంజుకున్న బీజేపీ

మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికీ బీజేపీ బలంగా పుంజుకున్నది. ఈ మధ్య కాలంలో బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 27.94 శాతం బలం పెరిగింది. అలాగే పటాన్‌చెరు సెగ్మెంట్‌లో 32.57 శాతం, జహీరాబాద్‌లో 18.02 శాతం, ఆందోలులో 23.75 శాతం, నారాయణఖేడ్ సెగ్మెంట్‌లో 20.42 శాతం ఓట్లు బీజేపీకి పెరిగాయి. మెదక్‌లో 33.88 శాతం, నర్సాపూర్ సెగ్మెంట్‌లో 15.54 శాతం ఓట్లను రాబట్టింది. అదే సమయంలో బీఆర్ఎస్ ఓట్లు గణనీయంగా తగ్గాయి. సంగారెడ్డి సెగ్మెంట్‌లో 23.40 శాతం ఓట్లు తగ్గగా, పటాన్‌చెరులో 22.56 శాతం ఓట్లు తగ్గాయి. అదే జహీరాబాద్ సెగ్మెంట్‌లో 38.14 శాతం, అందోల్‌లో 7.47శాతం, నారాయణఖేడ్ సెగ్మెంట్‌లో 10.73 శాతం ఓట్లకు గండిపడింది. మెదక్‌లో 17.95 శాతం, నర్సాపూర్ సెగ్మెంట్‌లో 16.22 శాతం ఓట్లు తగ్గాయి.

నేటి నుంచి 'బడిబాట'

- షెడ్యూల్‌లో విద్యాశాఖ మార్పు
- 19 వరకు పలు కార్యక్రమాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్/ మెదక్ అర్బన్, జూన్ 5 : సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభం కానున్నది. ఈనెల 3 నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. ఈ నెల 3 వ తేదీనే బడిబాట కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఉండడంతో అధికారులు వాయిదా వేశారు. బుధవారం ప్రభుత్వం కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

ఇదీ షెడ్యూల్

బడిబాట కార్యక్రమంలో భాగంగా రోజూ వారి విడుదల చేసిన షెడ్యూల్‌ను విద్యాశాఖ సమగ్ర శిక్ష అధికారులు మార్పు చేసి మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ నెల 6 న గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి బడిబాట కార్యక్రమ అమలుపై చర్చించనున్నారు. 7 న ఇంటింటి సర్వే చేసి పిల్లల వివరాలు నమోదు చేయనున్నారు. 8 నుంచి 10 వ తేదీ వరకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార బోర్డుతో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, సర్కారు బడుల్లో కల్పిస్తున్న విద్యాబోధన, వసతులు తదితర వాటిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయనున్నారు. అంతే కాకుండా బడీడు పిల్లలు, బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించనున్నారు. 11న గ్రామ సభ నిర్వహించి బడిబాట ఫలితాలపై చర్చించనున్నారు. 12న పాఠశాలలు తిరిగి చెరుచుకోనున్న నేపథ్యంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి స్వాగతం పలకనున్నారు. 13న పిల్లలందరూ బడికి రావాలని కోరుతూ రూపొందించిన ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు)పాటను వినిపించనున్నారు. 14న సామూహిక అక్షరాభాస్యం, ఉన్నత పాఠశాలల్లో బాల సభ నిర్వహణ, 15 గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ డే, 18న డిజిటల్ విద్యా, మొక్కలు నాటే కార్యక్రమం, 19న స్పోర్ట్స్ డేతో షెడ్యూల్ ముగియనుంది. రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలను నిర్వహించాలని విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులను భాగస్వామ్యం చేయనుంది.



ప్రవేశాలు పెంచడమే లక్ష్యం

బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా శ్రద్ధ వహిస్తాం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయనున్నాం. క్షేత్రస్థాయిలోనూ అవగాహన సదస్సులు, ర్యాలీల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాం.

- రాధాకిషన్, మెదక్ డీఈవో

షెట్కార్‌ను అభినందించిన రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 5: జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గెలిచిన సురేష్‌కుమార్ షెట్కార్ బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సురేష్ షెట్కార్‌ను అభినందించారు. ఎంపీగా విజయం సాధించిన ఆయన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన గెలుపునకు దోహదపడినందున షెట్కార్ సీఎంను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గెలిచినందుకు సీఎం సైతం షెట్కార్‌ను సన్మానించి అభినందించారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

- సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో 6.1 సెంటీమీటర్లు
- పిడుగుపాటుతో 9 మందికి గాయాలు, రెండు గేదెలు మృతి

మెదక్ అర్బన్/పుల్‌కల్/కోహీర్/తూప్రాన్, జూన్ 5: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం కమ్ముకున్న మేఘాలకు తోడు ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడింది. దాంతో వాతావరణం చల్లబడింది. సిద్దిపేట జిల్లా అంగడికిష్టాపూర్‌లో అత్యధికంగా 6.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... రేంబర్తి 3.6 సెం.మీ., మెదక్ జిల్లా నాగాపూర్‌లో 3.3 సెం.మీ., లక్ష్మాపూర్‌లో 2.1 సెం.మీ., సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 2 సెం.మీ., ఝరాసంగం 1.9 సెం.మీ., మెదక్ పాతూర్ 1.8 సెం.మీ., నారాయణఖేడ్ 1.4 సెం.మీ. వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలలు రాబోయే మూడు నాలుగు రోజుల్లో రాష్ట్రంలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నయని వాతావరణ శాఖ పేర్కొంది. పిడుగుపాటుతో 9 మందికి గాయాలపాలవగా, అందులో ఒకరు తీవ్ర గాయపడ్డారు. రెండు గేదెలు మృతిచెందాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో పొలం పనులు చేస్తుండగా మధ్యాహ్నం సమయంలో వర్షం పడుతుండగా చెట్టు కిందకు కూలీలు వెళ్లారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో వారికి కొద్ది దూరంలో పిడుగు పడింది. దీంతో అక్కడ ఉన్న గ్రామానికి చెందిన ఎండి బాబు నడుము నుంచి కింది భాగం వరకు గాయమైంది. అక్కడే ఉన్న ఎనిమిది మంది మహిళా కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్వల్పంగా గాయపడిన మహిళా కూలీలు తీవ్రంగా గాయపడిన బాబును అర కిలోమీటర్ వరకు పొలంలో నుంచి రోడ్డు వరకు మోసుకొచ్చారు. అక్కడి నుంచి ఆయనను వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. స్వల్పంగా గాయపడిన మహిళా కూలీలు కోహీర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు చేయించుకున్నారు. చౌటకూర్ మండలంలోని సరాఫ్‌పల్లి గ్రామంలో కుమ్మరి ఆంజనేయులు పొలం వద్ద మేతకోసం పాడి గేదెపై, తూప్రాన్ మండలం నర్సంపల్లి గ్రామ పంచాయతీ పరిధి రెడ్యానాయక్ తండాకు ధరావత్ బాల్‌సింగ్ ఇంటికి సమీపంలోని పొలం వద్ద కట్టేసిన గేదెపై పిడుగుపడడంతో మృతిచెందాయి.

ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీపై కదలిక !

- దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి, జాబితా విడుదలకు సిద్ధం

సంగారెడ్డి అర్బన్, జూన్ 5 : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి చేపట్టిన రిక్రూట్‌మెంట్‌పై కదలిక వచ్చింది. పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో పనిచేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్‌లో కింద 97 పోస్టులకు ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. మార్చి 18 వరకు దరఖాస్తులను స్వీకరించారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నియామక ప్రక్రియ నిలిచింది. తాజాగా ఆ ప్రక్రియను మళ్లీ మొదలుపెట్టారు. దరఖాస్తుల స్క్రూటీ పూర్తి చేసి, ప్రొవిజినల్ జాబితా సిద్ధం చేసినట్లు తెలిసంది. నేటితో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నాలుగైదు రోజుల్లో ఈ నియామకాలు ప్రక్రియ పూర్తి చేసే అవకాశాలున్నాయి.

పారదర్శకంగా జరిగేనా?

నియామకాల పారదర్శకతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌పై పూర్తి స్థాయి స్పష్టత లేదు. పనిచేసే ప్రాంతం, వేతనం, రోస్టర్ కూడా నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. అంతేకాకుండా మార్చిలో దరఖాస్తుల స్వీకరణకు మూడు రోజుల గడువు మాత్రమే ఇచ్చారు. ఆ క్రమంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న విషయం కూడా లెక్కించలేదంటూ ఆ శాఖ అధికారులు గోప్యంగా ఉంచారు. ఆ తర్వాత 'షెడ్యూల్ ఉన్నా.. వెలువడని ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో మార్చి 12న ఓ కథనం ప్రచురించడంతో సుమారు 3500కుపైగా దరఖాస్తులు వచ్చాయంటూ ఆ శాఖ అధికారులు ఓ నోట్‌ను విడుదల చేశారు. అంతే తప్పా దరఖాస్తులు ఎన్ని వచ్చాయోనని స్పష్టమైన సంఖ్యను పేర్కొనలేదు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో మార్చి 13న 22 మందితో కూడిన బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ల ప్రొవిజనల్ లిస్ట్‌తో పాటు తొమ్మిది మందితో కూడిన ఎంఎల్‌హెచ్‌పీల ప్రొవిజనల్ జాబితా కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చి అభ్యంతరాలు స్వీకరించారు. ఇక, 97 పోస్టులకు సుమారు 3500కుపైగా దరఖాస్తులు వచ్చాయంటున్న అధికారులు.. అందులో ఒక్క స్టాఫ్‌నర్సు పోస్టుకే అత్యధికంగా సుమారు 2100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపాయి. అయితే గతంలో నిబంధనలు పాటించకుండా ఇష్టంవచ్చిన వారి పేర్లే ఫైనల్ జాబితాలో చేర్చి ఉన్నతాధికారులను తప్పుదోవపట్టించి ఉద్యోగాలు కట్టబెట్టినట్లు ఆరోపణలున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గతంలో ఏదో కారణం చూపి కొన్ని పోస్టుల్లో నాన్‌లోకల్ వారికే ఉద్యోగాలిచ్చినట్లు విమర్శలు వచ్చాయి.

మెదక్‌లో నైతిక విజయం కాంగ్రెస్‌దే

- నీలం మధుకు భరోసా ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నీలం మధు, పక్కన మంత్రి కొండా సురేఖ

పటాన్‌చెరు/ పటాన్‌చెరు రూరల్, జూన్ 5: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే నైతిక విజయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధు, కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలం మధును సీఎం ఓదార్చారు. బెంగ పడాల్సిన అవసరం లేదని సముదాయించారు. విజయం దగ్గర దాకా వచ్చి చేజారిందని, అంతమాత్రాన బాధపడాల్సిన పనిలేదన్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు చేసిన తీవ్రమైన కృషిని సీఎం అభినందించారు. తృటిలో విజయం చేజారిందని, ఎవరూ అధైర్యపడకూడదన్నారు. నీలం మధుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. ఓటమి తప్పదని గ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు బీజేపీకి ఓట్లు వేసి గెలిపించారని ఆరోపించారు. తనకు అండదండలు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, జిల్లా కాంగ్రెస్ నాయకులకు నీలం మధు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు.. కేసు నమోదు

అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్టు గుర్తింపు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మునిపల్లి, జూన్ 5 : అధిక ధరలకు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న విత్తన డీలర్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని బుదేరా చౌరాస్తాలో ఉన్న పద్మావతి ఫర్టిలైజర్ షాపులో పత్తి విత్తనాలను ఎమ్మార్పీ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులకు విశ్వసనీయమైన సమాచారం అందింది. దీంతో, డీఏవో అంబికాసోని, ఏడీఏ శ్రీనివాస్‌ప్రసాద్, ఏవో శివకుమార్ బుధవారం ఆ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూజివీడు కంపెనీకి చెందిన ఆద్య వెరైటీ యూఎస్ 7067 రకం పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో ఈ విషయాన్ని డీలర్ వెంకట్‌రావు ఒప్పుకున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో, దుకాణంలో నిల్వ ఉన్న రూ. 43,69,248 విలువైన విత్తనాల విక్రయాన్ని నిలిపివేశారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించిన డీలర్ వెంకట్‌రావుపై కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నిఖిత

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

చిన్నశంకరంపేట, జూన్ 5: కన్నతండ్రికి ఓ కూతురు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన దడువాయి పరమేశ్వర్ (35) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య శంకరమ్మ, ముగ్గురు కూతుళ్లు నిఖిత, వెన్నెల, రుచిత ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు నిఖిత తండ్రికి తలకొరివి పెట్టింది.

మినీ బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు

చేగుంట, జూన్ 5 : దైవ దర్శనం చేసుకుని తిరిగివస్తున్న భక్తుల బృందం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. మెదక్ జిల్లా నర్సింగి మండలం వల్లూరు గ్రామ శివారులో 44వ జాతీయరహదారిపై మినీ బస్సు బోల్తాపడిన ఘటనలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, హైదరాబాద్‌కు చెందిన మిత్రులు, బంధువులు మొత్తం 21 మంది కాశీ, అయోధ్య యాత్రలకు మే నెల 24న హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి వెళ్లారు. పది రోజుల పాటు వివిధ క్షేత్రాలను దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. రైలు టికెట్లు దొరక్కపోవడంతో లక్నో నుంచి మినీ బస్సును అద్దెకు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నార్సింగి గ్రామ శివారులోని ఓ హోటల్‌లో టిఫిన్ చేసిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో వల్లూరు గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పక్కన ఢీకొని మినీ బస్సు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. ప్రమాదంలో గాయపడిన జ్యోతి, పూర్ణ, ఉమ, రాధిక, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నిర్మల, రమణ తదితరులను అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం 30 నిమిషాలకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మినీ బస్సును పోలీసులు క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆహ్మద్ మొయినుద్దీన్ తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన భక్తుల బృందం

నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా

నారాయణఖేడ్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. నారాయణ ఖేడ్ మండలంలో కాంగ్రెస్‌కు 6,421 ఓట్ల ఆధిక్యత లభించింది. మండలంలో బీఆర్ ఎస్‌కు 7,930, బీజేపీకి 15,695, కాంగ్రెస్‌కు 22,116 ఓట్లు వచ్చాయి. నాగల్‌గిద్ద మండలంలో కాంగ్రెస్‌కు 1,424 ఓట్ల ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 1,740, బీజే పీకి 6,963, కాంగ్రెస్‌కు 8,383 ఓట్లు వచ్చాయి. మనూరులో కాంగ్రెస్‌కు 2,961 ఓట్ల మెజారిటీ వచ్చింది. బీఆర్ఎస్‌కు 3,172, బీజేపీకి 5,670, కాంగ్రెస్‌కు 8,639 ఓట్లు వచ్చాయి. కంగ్టి మండలంలో కాంగ్రెస్‌కు 1,955 ఓట్ల ఆధిక్యత లభించగా, బీఆర్ఎస్‌కు 3,583, బీజేపీకి 9358 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 11,353 ఓట్లు వచ్చాయి. కల్హేర్ మండలంలో 1,814 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించగా, బీఆర్ఎస్‌కు 4,727 ఓట్లు రాగా, బీజేపీకి 6,837 ఓట్లు, కాంగ్రెస్‌కు 8,651 ఓట్లు వచ్చాయి. సిర్గాపూర్ మండలంలో కాంగ్రెస్‌కు 1,565 ఓట్లు ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 2,903, బీజేపీకి 6,072, కాంగ్రెస్‌కు 7,637 ఓట్లు వచ్చాయి. పెద్దశంకరంపేట మండలంలో కాంగ్రెస్‌కు 4,082 ఓట్ల ఆధిక్యత లభించింది. బీఆర్ఎస్‌కు 4,594 ఓట్లు రాగా, బీజేపీకి 7,415 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 11,497 ఓట్లు వచ్చాయి. మొత్తంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు 20,262 ఓట్ల ఆధిక్యత లభించింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డికి 91,373 ఓట్లు.. బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 84,826 వచ్చాయి. బీజేపీకి 7,823 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం.

మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్‌దే ఆధిక్యం

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో సైతం కాంగ్రెస్ ఆధిక్యత సాధించింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ ఆధిక్యత స్వల్పంగా తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 5,590, బీఆర్ఎస్ 4,432 ఓట్లు సాధించగా బీజేపీకి 453 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 1,158 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 5,394, బీజేపీ 4,454, బీఆర్ఎస్ 593 ఓట్లు సాధించాయి.

పారిశ్రామికవాడ మొగ్గు బీజేపీ వైపే...

- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
- ఆత్మపరిశీలనలో నాయకులు
- బీజేపీ క్యాడర్‌లో నూతనోత్సాహం

పటాన్‌చెరు, జూన్ 5: పటాన్‌చెరు పారిశ్రామికవాడ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకే బ్రహ్మరథం పట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్‌కు ఎదురుగాలి వీచింది. ఓటర్ల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత ఎదురవుతున్న విషయం గమనించి, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎమ్మెల్యే, నాయకులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. శాసనసభ ఎన్నికల్లో నామమాత్రంగా నిలిచిన బీజేపీకి.. లోక్‌సభ ఎన్నికల్లో లభించిన ఓట్లు చూసి బీఆర్ ఎస్ క్యాడర్ ఖంగుతిన్నది. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,03,775 ఓట్లు లభించగా, కాంగ్రెస్ అభ్యర్థికి 94,294 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి కేవలం 54,581 ఓట్లు మాత్రమే రావడం ఆ పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,05,387 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 98,296 ఓట్లు, బీజేపీకి కేవలం 19,600 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆరు నెలల్లోనే పారిశ్రామిక వాడ ఓటరు పూర్తిగా బీజేపీ వైపు మొగ్గు చూపడం గమనార్హం. పార్టీకి పట్టుందని భావిస్తున్న పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, బొల్లారం తదితర ప్రాంతాల్లో ఓటర్లు బీజేపీకి పట్టం కట్టగా.. బీఆర్ఎస్ తృతీయ స్థానానికి పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందో అని క్యాడర్ అంతర్మథనంలో పడిపోయింది. మరోవైపు పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో బీజేపీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. మెదక్ ఎంపీ సీటు గెలవడంతో పాటు కేంద్రంలో మోదీ సర్కార్ రావడంతో సంబరాలు చేసుకున్నారు. సెగ్మెంట్‌లో మరింత బలపడి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్ బీజేపీలో బయటపడిన లుకలుకలు





వేర్వేరు ప్రెస్‌మీట్లలో మాట్లాడుతున్న నర్సాపూర్ బీజేపీ నాయకులు

నర్సాపూర్, జూన్ 5: నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఎంపీ ఎన్నికల అనంతరం బయటపడ్డాయి. మెదక్ ఎంపీగా గెలిచిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును అభినందిస్తూ బీజేపీ ముఖ్య నాయకులు విడివిడిగా ప్రెస్‌మీట్లు పెట్టడం చర్చనీయంగా మారింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రమణారావు, కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, యాదగిరి, బుచ్చేస్‌యాదవ్ తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి బీజేపీకి ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు సీనియర్ నాయకుడు, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అరవింద్‌గౌడ్ తదితరులు విడిగా ప్రెస్‌మీట్ పెట్టారు. దీంతో, పార్టీలో అంతర్గతంగా ముసుకున్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి.



ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ఆవరణలో మొక్కను నాటుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- మెదక్ ఎస్పీ బాలస్వామి

మనోహరాబాద్, జూన్ 5: పర్యావరణాన్ని పరిరక్షించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెదక్ ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లి, చెట్లగౌరారం గ్రామా శివార్లలోని ఎమ్ ఎస్ అగర్వాల్ ఫౌండరీస్ పరిశ్రమలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశ్రమ ఆవరణలో మొక్కను నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తనవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణం బాగుంటేనే భవిష్యత్తు బాగుంటుందని చప్పారు. పరిశ్రమ యాజమని ప్రమోద్ అగర్వాల్, డైరెక్టర్ నరసింహ మాట్లాడుతూ ఈ సంవత్సరం పరిశ్రమ ఆధ్వర్యంలో సుమారు 5వేల మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. పర్యావరణ దినోత్సవం రోజున పరిశ్రమ ఆవరణలో 500 మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. ప్రతీ సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వసంత్ కూమార్, వెంకట్, సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అరెస్టు చేసినవారిని చూపుతున్న పోలీసులు

భూ ఆక్రమణకు పాల్పడిన ముఠా అరెస్టు

- పది మంది రిమాండ్‌కు తరలింపు

సంగారెడ్డి టౌన్, జూన్ 5: విలువైన భూమిని కాజేసేందుకు ప్రయత్నించడంతో పాటు భూ యాజమానిని, అక్కడ పనిచేసే కూలీలను భయభ్రాంతులకు గురిచేసిన ముఠాను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన ఆత్రియా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ అయిన మంతెన రామకృష్ణ శ్రీనివాస్‌వర్మ (ఎంఆర్ఎస్ వర్మ), అదే ప్రాంతానికి చెందిన పెండ్యాల హరినాథ్‌బాబుకు మునిపల్లి మండలంలో 100 ఎకరాల భూమిని ఇప్పిస్తానని, దానిని తానే డెవలప్‌మెంట్ కూడా చేస్తానని ఎంవోయూ చేసుకుని రూ. 30 కోట్లు తీసుకున్నాడు. అనంతరం పెండ్యాల హరినాథ్ బాబుకు 70 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఇందులో 10 ఎకరాలు డబుల్ రిజిస్ట్రేషన్. దీంతో తనకు పది ఎకరాల భూమి ఇవ్వాలని హరినాథ్‌బాబు వర్మను పదేపదే అడిగాడు. దీంతో ఆగ్రహం చెందిన వర్మ తన వద్ద పనిచేస్తున్న గణపతి రాజు (శ్రవణ్), గట్టుముక్కల భారత్‌వర్మ, పి.అశోక్‌రెడ్డి, పాషాలకు విషయం చెప్పాడు. వారు అఖిల్ అనే వ్యక్తిని సంప్రదించారు. దీంతో వీరంతా మే 26న మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామ పరిధిలో పెండ్యాల హరినాథ్‌కు చెందిన సర్వే నంబర్ 198, 251లోని భూమిలోకి కిరాయిరౌడీలతో కలిసి అక్రమంగా ప్రవేశించారు. తల్వార్, కత్తులు, కర్రలతో అక్కడ పనిచేస్తున్న వారిపై దాడి చేసి చంపుతామని బెదిరించి వెళ్లగొట్టారు. ఎక్స్‌కవేటర్ల సహాయంతో భూమి చుట్టూ వేసిన 800 ఫెన్సింగ్ కడ్డీలను విరగొట్టారు. ఈ దాడిలో గాయపడిన గాడిపర్తి రవీందర్‌బాబు అనే వ్యక్తి మునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంపై కేసు నమోదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, మునిపల్లి, కొండాపూర్ సీఐలు దర్యాప్తు చేపట్టి 17 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పది మందిని అరెస్ట్ చేసి, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.

టీఎఫ్‌డీసీ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి 'ఆటా' ఆహ్వానం



గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, జూన్ 5 : అమెరికాలోని తెలుగు సంఘం వారు నిర్వహిస్తున్న 18వ ఆటా(అట్లాంట) మహాసభలకు తెలంగాణకు చెందిన రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని ఆయన బుధవారం తెలియజేశారు. అమెరికాలోని జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో జూన్ 7, 8, 9న నిర్వహిస్తున్న తెలుగు సంఘం మహాసభలకు ఆ సంఘం అధ్యక్షుడు మధు బొమ్మినేని తనను ఆహ్వానించారని తెలిపారు. ప్రతీ రెండేళ్లకోసారి నిర్వహించే సభలకు తెలంగాణ నుంచి ప్రముఖులను ఆహ్వానిస్తారని తెలిపారు. ఈ ఏడాది తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.


కోర్టు ఆవరణలో మొక్కలను నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరీక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష


మహీంద్రా కర్మాగారం ఆవరణలో మొక్కలను నాటుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, తదితరులు


నారాయణఖేడ్ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయాధికారి శ్రీధర్‌మంథాని

పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దాం

- సీనియర్ సివిల్ జడ్జి సూరీక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


టేక్మాల్‌లో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జహీరాబాద్, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు అందరం సంఘటితమై మొక్కలు నాటాలని సీనియర్ సివిల్ జడ్జి సూరీక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వారు కోర్టు ఆవరణలో పలు మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కల పెంపకం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. మొక్కలను నాటడంతోనే సరిపోదని వాటిని పరిరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించిన వారమవుతామని తెలిపారు. ఇందులో భాగంగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులు వివిధరకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మహీంద్రా కర్మాగారం ఆవరణలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు కార్మికులతో కలిసి మొక్కలు నాటారు.

●**నారాయణఖేడ్:** పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్ మంథాని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ న్యాయవాదులు బోజిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, సంగమేశ్వర్‌రెడ్డి, సాయిలు, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జిన్నారంలోని ఈఐడీసీ పరిశ్రమ వద్ద మొక్కలు నాటుతున్న పరిశ్రమ కార్మికులు

●**జిన్నారం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈఐడీసీ పరిశ్రమ వద్ద సీఐటీయూ యూనియన్ కార్మికులు మొక్కలు నాటారు.

మెదక్ జిల్లాలో

టేక్మాల్, జూన్ 5: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని ఎంపీవో పౌల్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం టేక్మాల్ మండలం మల్కాపూర్ గ్రామంలో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువుకట్టపై గుంతలు తీసి మొక్కలు నాటి కూలీలతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అనిత, ఈసీ బాలరాజ్, టీఏ గంగారాం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోర్టు ధిక్కారం కేసులో పోలీసు అధికారులకు జరిమానా

శివ్వంపేట, జూన్ 5: భూవివాదంలో కొందరికి సహకరించిన డీఎస్పీ, సబ్ ఇన్స్‌పెక్టర్‌లకు హైకోర్టు జరిమానా విధించింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం సికింద్లాపూర్ శివారులో హైదరాబాద్‌కు చెందిన కరుణాకర్ రెడ్డి, అతని కుటుంబ సభ్యుల పేర 50 ఎకరాల 20 గుంటల భూమి ఉంది. ఆ భూమిని డెవలప్‌మెంట్ చేయడం కోసం మెస్సేర్స్ ఇష్టా బిల్డర్స్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థకు విల్లా ప్రాజెక్టుగా ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం నిర్ణీత కాలంలో డెవలప్ చేయకపోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. అయితే, ఈ వివాదం కోర్టులో ఉండగా, మెస్సేర్స్ ఇష్టా బిల్డర్స్ అండ్ డెవలప్మెంట్‌కు చెందిన జీసందీప్‌కుమార్, నిఖిల్‌రెడ్డిలు కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ, దౌర్జన్యంగా కరుణాకర్ రెడ్డికి చెందిన భూమిలో ప్రవేశించారు. అయితే, వారికి తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, గతంలో శివ్వంపేటలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికాంత్‌రావులు సహకరించారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించేందుకు సహకరించిన సదరు పోలీసుల అధికారులకు హైకోర్టు రూ. 2 వేల జరిమానా చొప్పున విధించింది. అలాగే సందీప్ రెడ్డి, నిఖిల్‌లకు నెల రోజులు జైలుతోపాటు జరిమానా విధించింది.

హత్యాయత్నానికి పాల్పడిన పలువురి అరెస్ట్

జహీరాబాద్, జూన్ 5: జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన దిడిగిబాయి లక్ష్మారెడ్డిపై జహీరాబాద్ పట్టణానికి చెందిన పలువురు దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి, పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డిపై పట్టణంలోని భరత్‌నగర్, జహీరాబాద్‌కు చెందిన మహ్మద్‌ఖదీర్, షేక్‌ఇర్ఫాన్, మహ్మద్ అహ్మద్, మహ్మద్‌జమీర్‌పాషలు ఈ నెల 4న హత్యాయత్నానికి పాల్పడి రాడ్లతో దాడిచేశారని తెలిపారు. దీంతో గాయాలపాలైన లక్ష్మారెడ్డి వారి నుంచి తప్పించుకున్నాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. నిందితుల్లో మహ్మద్‌ఖదీర్ పరారీలో ఉన్నాడన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్

- ఎంపీడీవో హామీతో పనుల్లో చేరిన కార్మికులు



కార్మికులతో చర్చిస్తున్న ఎంపీడీవో శంకర్‌యాదవ్

అల్లాదుర్గం, జూన్ 5: అల్లాదుర్గం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఐదునెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో 'సమ్మెబాట పట్టిన పంచాయతీ కార్మికులు' అనే కథనం ఈ నెల 5న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో శంకర్‌యాదవ్ బుధవారం కార్మికులతో చర్చించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరుచేసే అవకాశం ఉన్నదని, నిధులు మంజూరైన వెంటనే వేతనాలు చెల్లిస్తానని హామీఇవ్వడంతో కార్మికులు పనులు చేసేందుకు అంగీకరించారు.

నకిలీ విత్తనాలను అరికట్టేందుకే తనిఖీలు


సిర్గాపూర్‌లో విత్తనాలు, ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

కల్హేర్, జూన్ 5: నకిలీ విత్తనాలను అరికట్టేందుకే నారాయణఖేడ్ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ తెలిపారు. బుధవారం సిర్గాపూర్‌లోని విత్తన, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీఏ హెచ్చరించారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, జూన్ 5: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ద్వితీయ భాష పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 47 మందికి 15 మంది హాజరుకాగా, 32 మంది గైర్హాజరయ్యారు. 31.91 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్, సంగారెడ్డిలోకి కరుణ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ తనిఖీ చేశారు.

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం అవసరం

- జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్

నిజాంపేట, జూన్ 3: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం ఎంతో అవసరమని జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో ఆరోగ్యమే మహాభాగ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌కు బుధవారం తనవంతుగా రూ.30 వేల విరాళం అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయామానికి కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. అలాగే గ్రామానికి చెందిన తాజా, మాజీ వార్డుసభ్యుడు ఆముదరాజు తనవంతుగా రూ.11,311 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమే మహాభాగ్యం కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సు దరఖాస్తుల గడువు పెంపు

- గిరిజన గురుకులం రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్

నర్సాపూర్, జూన్ 5: వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలో 2024-25 సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి దరఖాస్తు గడువు పెంచినట్లు గిరిజన గురుకులం రీజినల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ(హెచ్‌ఈపీ), బీఎస్సీ(ఎంపీసీ) గ్రూపులలో ప్రతి గ్రూపులో 40సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నదని తెలిపారు. ఇందులో చేరిన వారికి డిగ్రీతో పాటు సాయుధ దళాల ఉద్యోగాలకు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జూన్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక రాత పరీక్ష ఆధారంగా చేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9963584516, 9398068250 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నాగల్‌గిద్ద, జూన్ 5: మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ గెలుపొందడంతో బుధవారం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు దత్తాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు 101 కొబ్బరి కాయలు కొట్టి, బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాణిక్యరావుపటేల్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, ఎంపీటీసీ పండరినాథ్‌రావుపటేల్, యూత్ అధ్యక్షుడు ఓంకార్‌స్వామి, నాయకులు అనిల్‌పటేల్ పాల్గొన్నారు.

సురేష్‌షెట్కార్ గెలుపు పట్ల హర్షం

రాయికోడ్, జూన్ 5: జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీగా సురేష్‌కుమార్‌షెట్కార్ గెలుపుపట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు చూసి ప్రజలు మరోమారు కాంగ్రెస్‌కు ఓటేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించారన్నారు. జడ్పీటీసీఈ మల్లికార్జున్‌పాటిల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీనర్సింహులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్, జూన్ 5: నర్సాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల పోస్టర్‌ను గౌడ సంఘం నాయకులు ఆలయ ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 11,12 తేదీల్లో అమ్మవారి వార్షికోత్సవాలను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. 11న గణపతిపూజ, నవగ్రహపూజ, ధ్వజారోహణము, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయని, 12న కల్యాణం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

మనోహరాబాద్, జూన్ 5: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మండలంలోని పాలాట గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలోని తిమ్మనకుంటలో అనుమతులు లేకుండా పట్టపగలే మట్టి తరలిస్తుండడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశామన్నారు.

తూప్రాన్‌లో 'బడిబాట'

తూప్రాన్, జూన్ 5: తూప్రాన్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-7లో టీచర్ ఇందిరా ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి అంగన్‌వాడీ ఈడు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జూన్ 5 : రాష్ట్ర బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు మంత్రి పొన్నంను కలిసి మల్లన్న ఆలయ ప్రసాదం అందించారు.

మర్పడగ మల్లన్నకు అన్నాభిషేకం

కొండపాక, జూన్ 5: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని సంతాన మల్లికార్జున స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లఘున్యాస పూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

అధ్యాపకుల చేతుల్లో విద్యార్థుల భవిష్యత్తు

సిద్దిపేట క్రైం, జూన్ 5: విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతుల్లో ఉందని పొరపాట్లు లేకుండా మూల్యాంకనం చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం అధికారి, జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులకు మూల్యాంకనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మార్కు విద్యార్థులకు ఎంతో విలువైందన్నారు. జవాబులను క్షుణ్ణంగా చదివి తగిన మార్కులను కేటాయించాలని సూచించారు.

కాంగ్రెస్ గెలవొద్దనే బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం

- పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి, డీసీసీ అధ్యక్షుడు

నర్సాపూర్, జూన్ 5: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెనుకబడిన వర్గానికి చెందిన నీలం మధు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ గెలవొద్దనే ఉద్దేశంతో బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారిగా చేతులు కలపడం వల్లనే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలిచాడని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. బుధవారం నర్సాపూర్‌లోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ అభ్యర్థి గెలిచినా.. నైతికంగా కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలిచాడన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు సొంత ఇలాఖ మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ గెలుస్తుందని గుర్తించి బీఆర్‌ఎస్ లోపాయికారిగా బీజేపీకి మద్దతు పలికారని ఆయా నియోజకవర్గాల్లో పడిన ఓట్లను బట్టి ఇట్టే తెలుస్తుందన్నారు. రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ఇక కాలం చెల్లిందని ఆ పార్టీని ఇక బీజేపీలో విలీనం చేసుకోవాల్సిందే అంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, హకీం, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గుప్తా, లలిత, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, నారాయణరెడ్డి, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అశోక్, ఉదయ్, రషీద్, అజ్మత్, అశోక్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ


గొంగ్లూరు మహిళలతో జయశంకర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు

పుల్‌కల్, జూన్ 5: మండలంలోని గొంగ్లూరు గ్రామంలో మహిళలకు ఆదాయ ఉత్పత్తులపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు-సర్వోదయ మహిళా సంస్థ అధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఏఆర్-ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నోడల్ అధికారి డాక్టర్ సీమ, అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పండ్లు, కూరగాయలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దాదాపుగా 80 మంది మహిళలకు జామ్‌లు, స్క్వాష్‌లు, టాఫీలు, కెచప్‌లపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ టి.సుప్రజ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడేందుకు సొంతంగా సంస్థలను నెలకొల్పేలా తీర్చిదిద్దుతామన్నారు. పిల్లలు, మహిళలకు పోషకాహారం ప్రాముఖ్యత, ఆహార ఉత్పత్తుల తయారీలో శిక్షణ కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. పెరుగుతున్న జీవనశైలికి అనుగుణంగా రోజువారీ ఆహారంలో తీసుకోవాల్సిన పదార్థాలపై కులంకశంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, సర్వోదయ మహిళా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.సుధాకర్‌నాయక్, నాయకులు పల్లె సంజీవయ్య, గోపాల్‌రెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంకు పథకాలపై ఇంటింటి ప్రచారం

కల్హేర్, జూన్ 5: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతనంగా ప్రవేశపెట్టిన వివిధరకాల ఆర్థిక ప్రయోజనాలపై ఖాతాదారులకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నట్లు సిర్గాపూర్ బ్రాంచి డీసీసీబీ మేనేజర్ రవిందర్ తెలిపారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు బ్యాంకు పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఇంటింటికి వెళ్లి బ్యాంకు పథకాలను వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. 'బచ్‌పన్ భరోసా' అనే డిపాజిట్ పథకం నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందని, ఇందులో 10 ఏళ్లలోపు పిల్లల పేరున 9 ఏళ్లు డిపాజిట్ చేస్తే అనంతరం రెండింతలు చెల్లించబడుతుందన్నారు. ఇదేకాకుండా బ్యాంకు ద్వారా దీర్ఘకాలిక, గృహ రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై, విద్య, వాహనాల కొనుగోలుకు, మహిళా గ్రూపులకు రుణాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీనివాస్, సాయిముఖేష్, శిల్ప పాల్గొన్నారు.


రఘునందన్‌రావును కలిసిన బీజేపీ నాయకులు

ఎంపీలను కలిసిన నాయకులు

తూప్రాన్/మనోహరాబాద్, జూన్ 5: మెదక్ పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలుపొందిన మాధవనేని రఘునందన్ రావు, మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను తూప్రాన్ మండలానికి చెందిన బీజేపీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి వర్గంటి రామ్మోహన్ గౌడ్, సీనియర్ నాయకులు జంగంపేట సాయిబాబాగౌడ్, జగన్‌గౌడ్‌లు కలిసి అభినందనలు తెలిపారు. మెదక్ ఎంపీగా గెలిచిన మాధవనేని రఘునందన్‌రావును, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఈటల రాజేందర్‌ను మనోహరాబాద్ మండలానికి చెందిన సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు చంద్రశేఖర్ ముదిరాజ్, జగన్‌గౌడ్, రాజు, కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు.


ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ తూప్రాన్ నాయకులు

రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, జూన్5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు ఆరు గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. నగరంలోని లింగంపల్లి, పటాన్‌చెరు, ఈఎస్ఐ కమాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న 900 ఎంఎం డయా పీఎస్సీ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు 24గంటల పాటు జరగనున్నాయి. దీంతో ఆపరేషన్ మెయింటనెన్స్ 8, 9 డివిజన్లలో అంతరాయం తలెత్తనుందని, ముఖ్యంగా పటాన్‌చెరు, ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్‌పేట్, డోయెన్స్ కాలనీ, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్, బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, టౌన్‌షిప్, హెచ్‌సీయూ, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతవాసులకు అంతరాయం తలెత్తుందని, నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

మెరుగైన వైద్య సేవలందించడంలో విఫలం

- బీజేపీ జహీరాబాద్ మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ జ్యోతిపండాల్

జహీరాబాద్, జూన్ 5: జహీరాబాద్ పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలందించడంలో వైద్యులు, సిబ్బంది విఫలమయ్యారని బీజేపీ జహీరాబాద్ మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ జ్యోతిపండాల్ పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది లాంగ్‌స్టాండింగ్ ఉండడంతో విధులను పక్కనబెట్టి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఎప్పుడు చూసినా ఆస్పత్రిలో సక్రమంగా ఉండరని ఆరోపించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కూడా ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది పనితీరును పట్టించుకోవడంలేదన్నారు. ఆస్పత్రిలో పనిచేసే కొందరు వైద్యులు ఇటీవల సంగారెడ్డిలోని గీతం కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఏకంగా ఎంపీగా గెలిచిన సురేష్‌కుమార్‌షెట్కార్ మద్దతుగా నిలబడి సంబరాల్లో పాల్గొన్న తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవప్రదమైన వైద్య వృత్తిలో కొనసాగుతూ రాజకీయాలు చేయడం బాగాలేదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు.

తూప్రాన్‌లో బీజేపీ శ్రేణుల సంబరాలు

తూప్రాన్/రామాయంపేట, జూన్ 5: తూప్రాన్ పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మెదక్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు విజయం సాధించడంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చారు. పట్టణంలో బీజేపీ జెండాలను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ నాయకులు భూమనగారి జానకిరాంగౌడ్, నర్సింహ్మారెడ్డి, సిద్దిరాములు యాదవ్, పోతరాజునాగరాజు, గట్టు అమర్, అడెపు మధుసూదన్, సాయిబాబాయాదవ్, పర్స పోచేందర్, శరత్ వినయ్‌రాజ్ పాల్గొన్నారు. రామాయంపేట పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల హర్షం

పెద్దశంకరంపేట, జూన్ 5: కేంద్రంలో మూడోసారి బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వీడని సంగమేశ్వర్ అదృశ్యం మిస్టరీ

- రెండురోజులుగా 'వర్సిటీ' ఎదుట కుటుంబసభ్యులు, బంధువుల ఆందోళన
- రెండురోజుల్లో ఆచూకీ కనిపెడతామని పోలీసుల హామీ
- ఆందోళన విరమించిన కుటుంబీకులు

మునిపల్లి, జూన్ 5: మండలంలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సెన్ యూనివర్సిటీలో కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన సంగమేశ్వర్ నాలుగేళ్లుగా గార్డెన్ వర్కర్‌గా పనిచేస్తూ ఆదివారం అర్ధరాత్రి అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే సంగమేశ్వర్ అదృశ్యం మిస్టరీ నాలుగురోజులు అవుతున్నా వీడడం లేదు. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు సంగమేశ్వర్‌ను చూపించాలని బుధవారం ఆందోళన చేస్తూ.. యూనివర్సిటీ డైరెక్టర్ వర్మ, సిబ్బందితో వాగ్వావాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. విషయం తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా ఏఎస్పీ సంజీవ్‌రావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐలు అశోక్, మహేష్, ఎస్ఐలు సురేష్, విజయ్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించి యూనివర్సిటీ లోపలికి తీసుకెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం 165 జాతీయ రహదారిపై సంగమేశ్వర్ కుటుంబసభ్యులు, బంధువులు రాస్తారోకో నిర్వహించగా.. 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంగమేశ్వర్ ఆచూకీ రెండురోజుల్లో కనిపెడతామని పోలీసుల హామీతో ఆందోళన విరమించారు.



165వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు